క్లుప్తంగా

బాలికల సమస్యల పరిష్కారానికి కృషి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీదేవి

దెందులూరు: బాలికల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని దెందులూరు ఎంపీడీవో శ్రీ దేవి కోరారు. మంగళవారం దెందులూరు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో అంగన్‌వాడీ, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్, ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులకు కిశోర వికాసంపై శిక్షణ, అవగాహన సదస్సు నిర్వహించారు. వెలుగు ఏపీఎం సురేష్ మాట్లాడుతూ వెలుగు శాఖ జెండర్ ఆధారిత హింస బాలల విద్య, గృహహింస, ఇతర అంశాలపై పనిచేస్తుందన్నారు. దెందులూరు సెక్టార్ సూపర్‌వైజర్ చిట్టెమ్మ, ఉపాధ్యాయురాలు జి.జ్యోతి, అంగన్‌వాడీ, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్, ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు, మహిళా పోలీసులు హాజరయ్యారు.

మహిళా సాధికారతే లక్ష్యంగా కృషి చేయాలి

భీమడోలు: బాల్య వివాహాల నియంత్రణలో కిశోర బాలికా వికాసం బృందాలు భాగస్వామ్యులు కావాలని భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి అన్నారు. భీమడోలు ఎంపీపీ సమావేశ మందిరంలో మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా మండలస్థాయిలో వివిధ శాఖల అధికారులు, బృంద సభ్యులకు కిశోర బాలికా వికాసం కార్యక్రమంపై ఒక రోజు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, సీడీపీవో కేవీ విజయలక్ష్మి పాల్గొని ప్రసంగించారు. ప్రతి నెల 2, 4వ శనివారాల్లో టీము సభ్యులతో అంగన్‌వాడీ కేంద్రాల్లో సమావేశాలను నిర్వహించాలని ఎంపీడీవో సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్‌డీ ఏ.సుందరి, ఏపీఎం రత్నకుమారి, సూపర్‌వైజర్ నూర్జహాన్ పాల్గొన్నారు.

25 గ్రామ కమిటీలు ఏర్పాటు

ఉంగుటూరు : మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో కిషోర బాలికలు వికాసం కోసం 25 గ్రామ కమిటీలు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో రాజ్‌మనోజ్ వెల్లడించారు. మంగళవారం ఆయన స్థానిక సమావేశపు హాలులో అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసు, ఆరోగ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లోని కిషోర బాలికల కమిటీలో ఏఎన్‌ఎం, అంగన్‌వాడీలు, వెల్ఫేర్ సహాయకులు, మహిళా పోలీసు, టీచరు ఉంటారని తెలిపారు. ఈ కమిటీ కన్వీనర్‌గా మహిళా సంరక్ష కార్యదర్శి వ్యవహరిస్తారని తెలిపారు. ప్రతి రెండు, నాలుగో శనివారాలు సమావేశమై గ్రామంలో కిషోర బాలికలు విషయమై చర్చిస్తారని తెలిపారు. ఏపీఎం ప్రభావతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు డి.శారదామని, బీవీ లక్ష్మి, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచరు పి.భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలు వాయిదా

ఉంగుటూరు: సాగునీటి సంఘాలకు రైతులు సమాయత్తమవుతున్న తరుణంలో తుపాను కారణంగా వాయిదా వేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. దాంతో ఎన్నికలకు సిద్ధమైన రైతులు నిరుత్సాహం చెందారు. ఉంగుటూరు మండలంలో మెట్ట ప్రాంతంలో 8 మైనర్ ఇరిగేషన్ చెరువులకు, డెల్టాలో 7 మేజరు ఇరిగేషన్ సంఘాలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. గ్రామ రెవెన్యూ అధికార్లు ఓటరు జాబితాలు సిద్ధం చేశారు. ఎన్నికల సిబ్బందికి శిక్షణ పూర్తి చేశారు. ఈ తరుణంలో ఎన్నికలు వాయిదా వేయడంతో రైతుల్లో నిరుత్సాహం నెలకొంది.

63,344 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

ఉంగుటూరు: నియోజకవర్గం పరిధిలో రూ.145.70 కోట్ల విలువైన 63,344 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 7,727 మంది రైతుల నుంచి కొనుగోలు చేసినట్లు జిల్లా పౌరసరఫరాల మేనేజర్ వి శ్రీలక్ష్మి తెలిపారు. గతేడాది 5,399 మంది రైతుల నుంచి రూ.92.99 కోట్ల విలువైన 42719.240 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్టు ఆమె వెల్లడించారు. 17 శాతం ధాన్యం తేమ నిబంధనను తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో 25 శాతానికి మార్పు చేసినట్టు తెలిపారు.

పేద విద్యార్థి ఆపరేషన్‌కు ఆర్థిక సాయం

భీమడోలు: ఓ నిరుపేద విద్యార్థి ఆపరేషన్‌కు ఆర్థిక సాయం అందజేసి గుండుగొలను వాసులు తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. గ్రామంలోని దాతల నుంచి సేకరించిన నగదును మంగళవారం గ్రూపు సభ్యులు టి.సుమన్‌బాబు, కర్రి దిలీప్, బాలిన అనిల్ విద్యార్థి తండ్రి ఆరసంకల సోములును కలిసి అందజేసారు. గ్రామంలోని ఆరసంకల సోములు కుమారుడు చైతన్య కృష్ణ నాలుగేళ్లుగా కీళ్లవాతంతో నడవలేని స్థితిలో ఉంటున్నాడు. విద్యార్థి చదువు కూడా మధ్యలో మానేసాడు. వెన్నుముకకు రెండు వైపులా ఆపరేషన్లు చేయాలని వైద్యులు చెప్పారు. సోములు ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉండడంతో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ద్వారా కొంత ఆర్థిక సాయం అందింది. ఆపరేషన్లకు ఆ నగదు సరిపోలేదు. దీంతో గ్రామస్తులు ఆర్థిక సాయం అందించారు.

దివ్యాంగులకు బంగారు 'భవిత'

- 21 రకాల వైకల్యాలపై భవిత కేంద్రాల్లో దివ్యాంగులకు శిక్షణ
- చిన్నారులకు ట్యాబ్‌లను అందించిన గత ప్రభుత్వం
- ఆరోగ్యం మెరుగుకు ఫిజియోథెరపీ



భీమడోలులో ట్యాబ్ ద్వారా దివ్యాంగులకు శిక్షణ అందిస్తున్న టీచర్లు వెంకటదుర్గ, రత్నకుమారి



చిన్నారికి ఫిజియోథెరపీ చేస్తున్న ఫిజియోథెరపిస్ట్ వింధ్య



సైక్లింగ్ చేస్తున్న దివ్యాంగ విద్యార్థి

భీమడోలు: ఉంగుటూరు నియోజకవర్గంలోని భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు, గణపవరం మండలాల్లోని భవిత కేంద్రాలు దివ్యాంగుల పాలిట వరంలా మారాయి. విభిన్న ప్రతిభావంతులను అక్కున చేర్చుకుంటున్నాయి వారి బంగారు భవిష్యత్తుకు భరోసాగా నిలిస్తున్నాయి. వారికి ప్రత్యేకంగా ఫిజియోథెరపీ నిర్వహిస్తూ వారిలో శారీరక వైకల్యాన్ని తొలగించేందుకు విశేష కృషి చేస్తూ వారి తల్లిదండ్రుల్లో తమ పిల్లల ఆరోగ్య పరిస్థితిపై భరోసా కల్పిస్తున్నాయి. విభిన్న ప్రతిభావంతులు పిల్లలు మిగిలిన వారంతో సమానంగా అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ప్రభుత్వం సహిత విద్యను అమలు చేస్తోంది. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు తమ ఇళ్లకే పరిమితం కాకుండా మానసిక, శారీరంగా ఎదగాలన్న లక్ష్యంతో భవిత కేంద్రాలను ఏర్పాటు చేసింది. దీనితో భవిత కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న సహిత విద్యా టీచర్లు వైకల్యంగల పిల్లల నుంచి వచ్చే ప్రతిఘటలను సైతం ఓపిక చూపుతూ చిరునవ్వుతో ఆ చిన్నారుల్లో మార్పు కోసం పరితపిస్తున్నారు. ప్రతి మండలంలో 200 మందికి పైగా చిన్నారులు శిక్షణ పొందుతున్నారు. ఆ కేంద్రాలు సమీపంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, యూపీ పాఠశాలల్లో ఏర్పాటు చేసారు. సమగ్ర శిక్షాభియాన్ పథకం ద్వారా ఈ కేంద్రాలు దివ్యాంగులకు ఉత్తమ సేవలను అందిస్తున్నాయి. వీటి పనితనంపై పిల్లల తల్లిదండ్రులు సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. భీమడోలులోని ఉన్నత పాఠశాలలో ఉన్న భవిత కేంద్రంలో 18 ఏళ్లలోపు ప్రత్యేకావసరాల గల పిల్లలు 220 మంది ఉండగా మండల భవిత కేంద్రంలో 20 మంది శిక్షణ పొందుతున్నారు. మిగిలిన వారిలో కొంత మంది మంచానికి పరిమితమై ఉండగా మరికొంత మంది వివిధ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్నారు.

భవిత అందించే సేవలు

స్థానికంగా భవిత కేంద్రం నడుస్తుంది. ఇందులో ఒకరు కేర్ టేకర్, ఇద్దరు ఐఈఆర్‌టీలు ఉంటారు. ఈ కేంద్రంలో స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపి, మానసిక ఎదుగుదల లేని వారికి శిక్షణ అందిస్తూ వారిని సాధారణ స్థితికి తీసుకుని వస్తున్నారు. వారానికి ఒక రోజు ఫిజియోథెరపీ చేస్తుంటారు. 21 రకాల వైకల్యాలు గల విద్యార్థులకు ఇక్కడ విద్యాబోధనతో పాటు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. వారిలో మానసిక, శారీరక వైకల్యం, చలన వైకల్యం గల ఎక్కువ మంది విద్యార్థులుండగా వారికి ప్రత్యేక అవసరమైన శిక్షణను అందిస్తూ సకలాంగులుగా తీర్చిదిద్దేందుకు భవిత కేంద్రం సిబ్బంది కృషి చేస్తున్నారు.

భవిత కేంద్రాల్లో సౌకర్యాలు

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో భవిత కేంద్రాల్లో చదువుకునే 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందించింది. ఆ ట్యాబ్‌ల్లో దివ్యాంగ విద్యార్థులు చిత్రలేఖనంతోపాటు పలు అంశాలు నేర్చుకునేవారు. భీమడోలులోని భవిత కేంద్రంలో ఐదుగురు విద్యార్థులకు ట్యాబ్‌లు అందించారు. భవిత కేంద్రంలో చిన్నారులకు మధ్యాహ్న భోజనం అందిస్తారు. ఐఈఆర్‌టీలు గ్రామాల్లో అవగాహన కల్పించి దివ్యాంగులు భవిత కేంద్రాలకు వచ్చే విధంగా కృషి చేస్తున్నారు. కేంద్రానికి రాలేని దివ్యాంగ విద్యార్థులకు వారి ఇళ్లకు ఒక రోజు భవిత టీచర్లు, సిబ్బంది వెళ్లి ఫిజియోథెరపీ చేస్తూ వారి యోగక్షేమాలను తెలుసుకుంటు న్నారు. నెలకొకసారి కేర్ టేకర్‌గా వచ్చే వారికి నెలకు రూ.300 చొప్పున అందిస్తారు. ఏడాదికి రూ.3వేలు, బాలికలకు అదనంగా మరో రూ.2 వేలను వారికి రవాణాభత్యం కింద అలవెన్సును అందిస్తుంది. ఫిజియోథెరపీ రోజున కేర్ టేకర్లకు మధ్యాహ్న భోజనం అందిస్తారు.

మా అబ్బాయిలో మార్పు వచ్చింది



మా అబ్బాయి చిన్నతనం నుంచి వినికిడి లోపం వల్ల మాటలు రాలేదు. కొన్నేళ్ల పాటు భీమడోలు భవిత కేంద్రానికి ప్రతి రోజు తీసుకుని వెళ్లడం ద్వారా ప్రత్యేక శిక్షణతో పాటు స్పీచ్ థెరపీ చేసారు. దీనితో కొంత మార్పు వచ్చింది. మా అబ్బాయి పదో తరగతి పరీక్షలు రాసి ఉత్తీర్ణుడయ్యాడు. చాలా సంతోషంగా ఉంది.

– మందే విజయకుమారి, సూరప్పగూడెం

ప్రతి రోజూ శిక్షణ



భీమడోలు భవిత కేంద్రంలో 20 మంది దివ్యాంగుల్లో శారీరక వైకల్యం గల చిన్నారులకు ఇద్దరు టీచర్లు ప్రతిరోజూ ప్రత్యేక శిక్షణ అందిస్తున్నాం. వారికి సైకిల్లింగ్ నేరిృంచి, ఫిజియోథెరపీ చేయిస్తాం. కేంద్రంలోని చిన్నారులకు ట్యాబుల ద్వారా శిక్షణ, మధ్యాహ్న భోజన పథకంలో పోష్టికాహారం అందిస్తున్నాం. దూర ప్రాంతాల నుంచి కేంద్రాలకు పిల్లలను తీసుకుని వచ్చే కేర్ టేకర్లకు పారితోషికం అందిస్తాం.

– చింతా వెంకట దుర్గ, ఐఈఆర్ టీచర్, భీమడోలు

ఇంటి వద్ద వ్యాయామం చేయించాలి



భీమడోలు భవిత కేంద్రానికి వారంలో ఒక రోజు గురువారం వచ్చి ఇక్కడ పిల్లలకు ఫిజియోథెరపీ చేసి వారి తల్లిదండ్రులకు ప్రతిరోజూ తమపిల్లలకు ఇంటివద్ద చేసే వ్యాయామ కృత్యాలను తెలియజేస్తాం. దీనితో వారంతా నిత్యం చిన్నారులతో వ్యాయామంచేయిస్తూ వారిపట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. దీని వల్ల వారి శారీరక వైకల్యంలో మార్పులు వచ్చి సాధారణ స్థితికి చేరుకుంటారు.

– గారపాటి వింధ్య, ఫిజియోథెరపిస్ట్, భీమడోలు

చర్చిల్లో క్రిస్మస్ ఏర్పాట్లు



చర్చికి విద్యుత్ దీపాలతో అలంకరణ



విక్రయానికి సిద్ధంగా ఉన్న క్రిస్మస్ స్టార్లు



భీమడోలు ఆర్‌సీఎం చర్చిని విద్యుత్ దీపాలతో ముస్తాబు చేసిన దృశ్యం

దెందులూరు: క్రిస్మస్ పండుగ ఏర్పాట్లు గ్రామాల్లో ముమ్మరంగా జరుగుతున్నాయి. సాల్వేషన్ ఆర్మీ ఆర్‌సీఎం, సీఎస్ఐ, సెవెంత్ డే, మన పెంతుకోస్తు, ఐసీఎం చర్చిలతో పాటు ఇతర స్వతంత్ర సంఘాల చర్చిలను ముస్తాబు చేస్తున్నారు. చర్చిలకు రంగులు వేసి, విద్యుత్ బల్బులు ఏర్పాటు చేస్తున్నారు. చర్చిల వద్ద స్టార్లు ఏర్పాటు చేశారు. క్రిబ్బులు, క్రిస్మస్ ట్రీలు ఏర్పాటు చేసే పనుల్లో చర్చిల నిర్వాహకులు, యూత్ సభ్యులు నిమగ్నమయ్యారు. మరో పక్కన అన్ని షాపుల్లో క్రిస్మస్ స్టార్లు, క్రిస్మస్ ట్రీలు, క్రిస్మస్ క్యాండిల్స్ ,క్రిస్మస్ డెకరేషన్ పేపర్లు నూతన డిజైన్లతో ముమ్మరంగా అమ్మకాలు సాగుతున్నాయి. అన్ని చర్చిల నిర్వాహకులు, యూత్ సభ్యులు గ్రామాల్లో రాత్రి వేళ క్యారల్స్ నిర్వహిస్తున్నారు. ఇప్పటికే సెమీ క్రిస్మస్ వేడుకలను చర్చిల్లో ఘనంగా నిర్వహిస్తున్నారు.

విద్యుత్ దీపాలతో ముస్తాబైన చర్చిలు

భీమడోలు: క్రిస్మస్ సంబరాలు అంబరాన్నంటాయి. గ్రామాల్లో క్రిస్మస్ సందడి మొదలైంది. ఏసుక్రీస్తు జన్మ వృత్తాంతాన్ని తెలిపేలా ప్రతి గ్రామంలో యువత ప్రార్థనాలయాల్లో విద్యుత్ దీపాలతో భారీ స్టార్స్‌ను ఏర్పాటు చేసి ఔరా అనిపించారు. ఉదయకాల ఆరాధన ప్రార్థన కార్యక్రమంలో పెద్ద ఎత్తున క్రైస్తవులు పాల్గొని ఏసు క్రీస్తును ఆరాధిస్తూ నెల రోజుల ముందుగా క్రిస్మస్ ఆనందాన్ని పొందుతున్నారు. భీమడోలు, గుండుగొలను, పూళ్ల తదితర గ్రామాల్లో ఆర్‌సీఎం, సీఎస్ఐ, రక్షణ సైన్యం, పెంతెకోస్తు, చర్చిల్లో క్రిస్మస్ ప్రార్థనలు ప్రారంభం కాగా ప్రతి చర్చిని విద్యుత్ దీపాలతో అలంకరించి ముస్తాబు చేసారు. భీమడోలు ఆర్‌సీఎం జీసస్ యూత్ సభ్యుల ఆధ్వర్యంలో ఆర్‌సీఎం చర్చిని విద్యుత్ దీపాలతో అలంకరించి, 25 అడుగుల భారీ స్టార్‌ను ఏర్పాటు చేసారు. విచారణ కర్త ఫాదర్ షింటో, ఫాదర్లు నెల్సన్, జింటో, జిజో, డీపాల్ విన్సెంట్ సొసైటీ సభ్యులు, పెద్దలు, జీసస్ యూత్, అధిక సంఖ్యలో విశ్వాసులు పాల్గొని ప్రార్థనలు చేస్తున్నారు.

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి



గణపవరం బాలికల వసతిగృహాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

గణపవరం: ఎమ్మెల్సీ, నీటి సంఘాల ఎన్నికలను ఎలాంటి వివాదాలకు తావులేకుండా పారదర్శకంగా పకడ్బందీగా నిర్వహించాలని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టరు సి.నాగరాణి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె గణపవరంలోని బాలుర ఉన్నత పాఠశాలలోని ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ బూత్‌లను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 5న నిర్వహించే ఎమ్మెల్సీ ఎన్నికలు, 8న నీటి సంఘాల ఎన్నికలను నిర్వహించే పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, సిబ్బంది నియామకం, పోలింగ్ కేంద్రాల వద్ద వసతులను ఆమె పరిశీలించారు. తహసీల్దార్ వైకేవీ అప్పారావు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నిక కోసం ఒక గదిని, నీటి సంఘాల ఎన్నికల కోసం ఆరు గదులను కేటాయించినట్లు కలెక్టరుకు వివరించగా ఆమె ఆ గదులను పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. ఈనెల 5న నిర్వహించే ఎమ్మెల్సీ ఎన్నిక ఏర్పాట్లు రేపు సాయంత్రానికే పూర్తిస్థాయిలో సిద్ధం చేసుకోవాలని, నిర్ణీత సమయం ప్రకారం పోలింగ్ ప్రారంభించి, ఎలాంటి వివాదాలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఎంపీడీవో బేబీ శ్రీలక్ష్మి, ఎంఈవో గౌర్రెల బాలయ్య, హెచ్‌ఎం ఎస్‌వీఎస్‌ఎన్ మూర్తి వివిధ శాఖల అధికారులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

హాస్టల్‌లో తనిఖీ : గణపవరంలోని బాలికల వసతి గృహాన్ని కలెక్టరు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా వసతి గృహంలోని పరిస్థితులను ఆమె పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న టాయిలెట్స్‌ను పరిశీలించి హౌసింగ్ శాఖ ఇంజనీరింగ్ అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. వసతి గృహంలోని గదులలో శ్లాబు పెచ్చులు ఊడి ఉండటాన్ని గమనించి, తక్షణ మరమ్మతులకు ఆదేశాలు జారీ చేశారు. గదుల్లో ఫ్లోరింగ్, డైనింగ్ హాలులో మరమ్మతులు చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం బాలికల ఉన్నత పాఠశాల,బాలుర ఉన్నత పాఠశాలలను ఆమె సందర్శించారు. రెండు ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ఆమె పలు సూచనలు చేశారు. హెచ్‌ఎం బాలభాస్కరరావు, ఎంఈవో గౌర్రెల బాలయ్య, అధికారులు పాల్గొన్నారు.

ఇంట్లోకి చొరబడి వెండి, నగదు చోరీ

పెదవేగి : ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు విలువైన వస్తువులు దొంగిలించుకుపోయారని పెదవేగి పోలీసులకు ఫిర్యాదు అందింది. పెదవేగి ఎస్సై కె రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం లక్ష్మీపురంలో ముల్పూరి వీరామణి ఈ ఏడాది అక్టోబర్ 28న బెంగళూరులో ఉంటున్న తన కూతురి ఇంటికి వెళ్లింది. డిసెంబర్ 3 మధ్యాహ్నం పనిమనిషి ఇంటికి వెళ్లగా తలుపులు తెరిచి ఉండటం చూసి ఆ విషయాన్ని యజమాని బంధువైన ములుకూరి పూర్ణచంద్రకి తెలియజేసింది. వారు ఇంటికి వెళ్లి చూడగా దొంగలు ఇంటిలోకి చొరబడి బీరువాలోని అరకేజీ వెండి వస్తువులు, రూ.15 వేల నగదు, ఇంటి దస్తావేజులను దొంగిలించినట్టు గుర్తించి పూర్ణచంద్రరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్సై తెలిపారు.

దివ్యాంగులు ఉన్నతంగా ఎదగాలి



భీమడోలులో విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎంఈవో 2 అయినపర్తి భాస్కర్‌కుమార్

భీమడోలు: దివ్యాంగులను సకలాంగులు తీర్చిదిద్దేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని, అవకాశాలును అందిపుచ్చుకుని ఉన్నతంగా ఎదగాలని భీమడోలు ఎంఈవో 2 అయినపర్తి భాస్కర్‌కుమార్ అన్నారు. భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలోని భవిత కేంద్రం వద్ద మంగళవారం అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హెచ్‌ఎం బి.శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఎంఈవోలు ఈదుపల్లి శ్రీనివాసరావు, అయినపర్తి భాస్కర్‌కుమార్ పాల్గొన్నారు. అనంతరం క్రీడాంశాల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులను అందించారు. దాతలు పెరుమాళ్ల గంగాధరరావు, ఉపాధ్యాయులు ఝాన్సీ, ఎం.శరీన్ అందించిన మిఠాయిలు చిన్నారులకు పంపిణీ చేశారు. దాతలను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. చిన్నారులతో కలిసి సహపంక్తి భోజనాలు చేసారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అహ్మద్, ప్రత్యే క ఎడ్యుకేషన్ టీచర్ అక్బరున్నీషా, ఐఈఆర్‌టీలు చింతా వెంకటదుర్గ, జి.రత్నాకుమారి, కేర్ టేకర్ శిరీషా, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాలు గల చిన్నారులను ప్రోత్సహించాలి



చిన్నారులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంఈఓలు



చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

పెదవేగి : ప్రత్యేక అవసరాలు గల చిన్నారులను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని పెదవేగి ఎంఈఓ1 ఏవీఎన్‌వీ ప్రసాద్ అన్నారు. మంగళవారం అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పెదవేగి ఎంపీపీఎస్ ప్రధాన పాఠశాలల్లోని భవిత కేంద్రంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ1 ఏవీఎన్‌వీ ప్రసాద్, ఎంఈఓ2 వి అరుణ్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఈఓ1 ప్రసాద్ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను చదివించి, వారిని అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని సూచించారు. ఎంఈఓ2 అరుణ్ కుమార్ మాట్లాడుతూ దివ్యాంగులు చక్కగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. అనంతరం వివిధ పోటీల్లోని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. సర్పంచ్ తాతా శ్రీరామమూర్తి, టీఎస్ఎన్ మూర్తి సహకారంతో ఏర్పాటుచేసిన సహపంక్తి భోజనంలో అందరూ పాల్గొన్నారు. జెడ్పీహెచ్ పెదవేగి హెచ్‌ఎం కె మల్లేశ్వరి, ఎంపీహెచ్‌ఎస్ టి మాధవి, విద్యార్థుల తల్లిదండ్రులు, భవిత కేంద్ర ఉపాధ్యాయులు, కె సోమరాజు, ఎం విజయలక్ష్మి పాల్గొన్నారు.

బాల్యవివాహాలు అనాగరికం



కిశోర బాలికల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీలక్ష్మి

గణపవరం: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమేకాక అనాగరిక చర్య అని, బాల్యవివాహాలు జరగకుండా ప్రజల్లో అవగాహన కల్పించడం మనందరి బాధ్యత అని గణపవరం ఎంపీడీవో బేబీ శ్రీలక్ష్మి అన్నారు. మంగళవారం గణపవరం మండల పరిషత్ కార్యాలయంలో కిశోర బాలికా వికాసం 2.0పై అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా ఉపాధ్యాయులు, సచివాలయ పోలీసులు, సంక్షేమ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బేబీ శ్రీలక్ష్మి మాట్లాడుతూ బాల్య వివాహాల నిరోధం, బాలికా విద్య, బాలికా డ్రాపవుట్ల నిరోధం, బాలికల సంరక్షణ, పౌష్టికాహారం తదితర విషయాలపై సభ్యులకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి గ్రామంలో ఐదుగురు సభ్యులతో కమిటీలు ఏర్పాటు చేశామని, మహిళా పోలీసు, ఏఎన్‌ఎం, మహిళా ఉపాధ్యాయిని, అంగన్‌వాడీ కార్యకర్త, వెల్ఫేర్ అసిస్టెంట్లు సభ్యులుగా ఉంటారని అన్నారు. ఈ కమిటీ ప్రతి గ్రామంలో చదువు మధ్యలో మానేసిన 11 నుంచి 18 ఏళ్ల వయస్సు కలిగిన బాలికలను గుర్తించి వారికి ప్రతినెలా 2, 4వ శనివారాల్లో అంగన్‌వాడీ కేంద్రాల వద్ద సమావేశం నిర్వహించి, బాల్యవివాహం వల్ల కలిగే అనర్థాలు, రుతుస్రావం సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, పోక్సో చట్టం, స్వీయ పోషణ, బాలికల విద్య, ఆరోగ్యం, పోషకాహారం, రక్తహీనత తదితర విషయాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో గౌర్రెల బాలయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తులసి, చంద్రావతి, దుర్గాభవాని, హెచ్‌ఎం మూర్తి పాల్గొన్నారు.

మహిళల రక్షణకు అనేక చట్టాలు

గణపవరం: మహిళల రక్షణకు అనేకచట్టాలు అమలులో ఉన్నాయని ప్రతి మహిళా వాటిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని పలువురు అన్నారు. మంగళవారం గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజి మహిళా సాధికారత విభాగం, యూసీజీ, జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థల ఆధ్వర్యంలో నేషనల్ జెండర్ క్యాంపెయిన్– నయీచేతన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులకు మహిళా చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి అధ్యక్షత వహించారు. సదస్సులో హైకోర్టు న్యాయవాది ఏ.జిలానీభాషా, కడప అడ్వకేట్ మహబూబ్‌భాషా మాట్లాడుతూ మహిళలపై రోజురోజుకూ అత్యాచారాలు, వేధింపులు, దాడులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళల రక్షణకు గృహహింస (2005), పోక్సో (2012), పోష్ (2013) చట్టాలతో పాటు ఇంకా అనేక చట్టాలు మహిళలకు రక్షణ కల్పిస్తాయని అన్నారు. ఈ సదస్సులో వైస్‌ప్రిన్సిపల్ పి.మధురాజు, మహిళా సాధికారత విభాగం కన్వీనర్ కె.స్వరూపరాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

పశువుల షెడ్ల నిర్మాణం వేగవంతం

ఉంగుటూరు: మండలానికి మంజూరైన మినీ గోకులం షెడ్ల పనులు త్వరితగతిన పూర్తిచేయాలని ఎంపీడీవో రాజ్‌మనోజు సూచించారు. బుధవారం ఉంగుటూరు ఎంపీడీవో సమావేశపు హాలులో పశువైద్యులు, సహాయకులు, ఉపాధిహామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ మండలానికి 65 గోకులం షెడ్లు మంజూరుకాగా 50 షెడ్ల పనులు వివిధ దశల్లో ఉన్నాయని అన్నారు. మరో 15 షెడ్లు పనులు ప్రారంభం కావాల్సి ఉందని తెలిపారు. ఒక్కో షెడ్డు నిర్మాణానికి రూ.2.30 లక్షలు మంజూరైనట్లు ఆయన వివరించారు. ఇందులో లబ్ధిదారుని వాటా పది శాతం ఉంటుందన్నారు. పశువైద్యులు అశోక్, శిరీష, ఏపీవో మల్లికార్జున పాల్గొన్నారు.

కత్తితో మహిళపై దాడి

పెదవేగి : సరిహద్దు తగాదాలో ఓ వ్యక్తి మహిళను కత్తితో దాడి చేసి గాయపరచిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించింది. ఎస్సై కె రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం పెదవేగి మండలం విజయరాయి మెట్టమీద నివసిస్తున్న బొంకు కమలను మంగళవారం అదే గ్రామానికి చెందిన దుర్గాటి మాణిక్యాలరావు (40) చాకుతో దాడి చేసి గాయపర్చాడని ఎస్సై తెలిపారు. ఇంటి సరిహద్దు గొడవ నేపథ్యంలో తోటకూర తరుగుచుండగా కమలను వెనుక నుంచి వచ్చి మాణిక్యాలరావు కత్తితో ఆమె పొట్టలో పొడిచినట్లు తెలిపారు. కమలను 108లో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి స్థానికులు తీసుకెళ్లినట్టు పేర్కొన్నారు. కమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్సై రామకృష్ణ చెప్పారు.

దంత ఆరోగ్యంపై అవగాహన అవసరం

పెదవేగి : వ్యక్తిగత పరిశుభ్రత, దంత ఆరోగ్యంపై చిన్నతనం నుంచే విద్యార్థులకు అవగాహన కల్పించాలని సెయింట్ జోసెఫ్ దంత కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జి మెజెస్ అన్నారు. దుగ్గిరాల ఐఎస్‌పీపీడీ (ఇండియన్ సొసైటీ ఆఫ్ పీడియాట్రిక్ అండ్ ప్రివెంటివ్ డెంటిస్ట్రీ) ఆధ్వర్యంలో చిల్డ్రన్స్ వీక్ ఉత్సవాన్ని పురస్కరించుకొని నవంబర్ 19 నుంచి నవంబర్ 25 వరకు వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. ప్రొఫెసర్, హెచ్ఓడీ డాక్టర్ అరోన్ అరుణ్ కుమార్, పీడియాట్రిక్స్ విభాగం సిబ్బంది ఆధ్వర్యం వహించారు. మంగళవారం జాతీయ పీడియాట్రిక్ డెంటిస్ట్ డే సందర్భంగా సుమారు 450 మంది విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి పాల్గొన్నారు. సెక్రటరీ, కార్పొరేట్ మోస్ట్ రెవరెండ్ ఫాదర్ మోజెస్, ప్రిన్సిపల్ ఎస్ స్లీవా రాజు తదితరులు పాల్గొన్నారు.